క్లుప్తంగా

ఉచిత విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోండి

విద్యుత్ శాఖ ఏఈ శ్రీధర్

నందిగామ: అర్హులైన గృహ వినియోగదారులు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యుత్ శాఖ ఏఈ శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లు రాని వారు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారంతో పాటు రేషన్ కార్డు, ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు కనెక్షన్ నంబర్ , గ్యాస్ కనెక్షన్ నంబరు, ఫోన్ నంబర్, ప్రజా పాలన రఖాస్తు ఫారం రసీదు కాపీ తదితర ధృవ పత్రాల జీరాక్స్ కాపీలతో ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యార్థులకు మాత్రల పంపిణీ

శంకర్‌పల్లి: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా బుధవారం శంకర్‌పల్లిలోని పలు పాఠశాలల్లో మున్సిపాలిటీ సిబ్బంది విద్యార్థులకు మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల, వివేకానంద పాఠశాల, ఫత్తేపూర్, బంగ్లాగడ్డ ప్రభుత్వ పాఠశాల్లో పంపిణీ చేసినట్లు తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ.. మాత్రలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నోట్ పుస్తకాల వితరణ



పుస్తకాలు, ఇతర సామగ్రిని అందజేసిన కంపెనీ బృందం

శంకర్‌పల్లి: మండలంలోని జన్వాడ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు బుధవారం బ్యాగులు, నోటు పుస్తకాలు, షూస్, సాక్స్‌లు, స్టేషనరీని బ్రిలియస్ టెక్నాలజీ కంపెనీ వారు పంపిణీ చేశారు. అనంతరం ఆ కంపెనీ సీఈఓ రామ్‌నరేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల్లో చదివే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. చదువుల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబరిస్తే ప్రతి సంవత్సరం ఏదో రకంగా సాయం అందిస్తామని చెప్పారు. మండల విద్యాధికారి అక్బర్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు సాయం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు దేవేందర్‌రెడ్డి, కంపెనీ ప్రతినిధులు క్రిష్ణ, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధికి కృషి

ప్రధానోపాధ్యాయుడు నర్సింహ్మానాయక్



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న దృశ్యం

మొయినాబాద్‌రూరల్: విద్యార్థుల అభివృద్ధికి దాతల కృషి అభినందనీయమని అజీజ్‌నగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నర్సింహ్మానాయక్ అన్నారు. బుధవారం మండలంలోని అజీజ్‌నగర్ పాఠశాలలో ఓ దాత సహకారంతో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సింహ్మానాయక్ మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. మన ఊరు- మన బడిలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పెంటయ్య, రాంచందర్, శోభారాణి, గోపాల్, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెత్తకుప్పల్లో బాల్యం



కాగితాలు ఏరుకుంటున్న బాలుడు

కొత్తూరు: చదువుతోనే దేశం అభివృద్ధి చెందుతుంది.. ప్రతి ఒక్కరికి విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తున్నారు. ఇప్పటికే బడిబాట పేరుతో గ్రామాల్లో పర్యటించి బడీడు పిల్లలను బడుల్లో చేర్పించే కార్యక్రమాలు చేపట్టారు. అంతేకాకుండా చదువు యొక్క ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు, నాయకులు సమావేశాల ద్వారా తెలియజేస్తున్నారు. అయినప్పటికీ కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను బడుల్లోకి పంపకుండా పనులు చేయిస్తున్నారు. మరికొందరు పిల్లలు బడులకు వెళ్తున్నామని చెప్తూ బయట తిరుగుతున్నారు. ఇంకొందరు చెత్త కుప్పల్లో చిత్తు కాగితాలు ఏరుకుంటు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. కాగా, జాతీయ రహదారి పక్కన సరీ్వస్‌రోడ్డులో ఓ బాలుడు బుధవారం పాఠశాలకు వెళ్లకుండా కాగితాలు ఏరుకుంటున్నాడు. అతడిని సాక్షి పలుకరించగా ఈరోజు పాఠశాలకు వెళ్లలేదని అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

డేంజర్ హోర్డింగ్‌లు

- ఈదురుగాలులకు పొంచి ఉన్న ప్రమాదం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు

అసలే వర్షాకాలం.. దీనికి తోడు ఈదురు గాలులు తోడవడంతో హోర్డింగ్‌లు, ప్లెక్సీలు ఎక్కడ గాలికి కూలి మీద పడుతాయోనని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పలు ప్రాంతాల్లో భవనాలపై ఏర్పాటు చేసిన హోర్డింగులు ప్రమాదకరంగా మారుతున్నాయని.. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన హోర్డింగ్



చిలుకూరు బాలాజీ ఆలయనికి వెళ్లే రోడ్డు పక్కన భవనంపై ఏర్పాటు చేసిన హోర్డింగ్



హిమాయత్‌నగర్ చౌరస్తాలో ఓ భవనంపై ప్రమాదకరమైన హోర్డింగ్

మొయినాబాద్: ఇళ్లపై, రోడ్ల మధ్యలో ఏర్పాటు చేసిన హోర్డింగ్‌లు ప్రమాదకరంగా మారాయి. హోర్డింగ్‌లతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మొయినాబాద్ మండల కేంద్రంతో పాటు జేబీఐటీ, హిమాయత్‌నగర్, అజీజ్‌నగర్ చౌరస్తా, గండిపేట చౌరస్తా ప్రాంతాల్లో పెద్ద పెద్ద హోర్డింగులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో బలమైన ఈదురుగాలులకు హోల్డింగ్‌లు కూలే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఇతర ప్రాంతాల్లో కొన్ని చోట్ల హోల్డింగ్‌లు కూలి ప్రమాదాలు సంభవించాయి. హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి పక్కన, చిలుకూరు బాలాజీ దేవాలయం వెళ్లే రోడ్డు పక్కన భవనాలపై పెద్ద పెద్ద హోర్డింగ్‌లు పెట్టారు. అలాగే, హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి మధ్యలో సైతం పెద్దపెద్ద హోర్డింగ్‌లు ఉన్నాయి. ఈ హోర్డింగ్‌లతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని.. భవనాలపై, రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా హోర్డింగ్‌లు ఏర్పాటు చేసినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదకరమైన హోర్డింగులను తొలగించాలని కోరుతున్నారు.

రోటరీ క్లబ్ సేవలు మరువలేనివి

స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా ఛైర్‌పర్సన్ విశాల



నోటరీ క్లబ్ ఇచ్చిన పుస్తకాలతో విద్యార్థులు

కేశంపేట: ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులకు రోటరీ క్లబ్ అందిస్తున్న సేవలు మరువలేనివని స్త్రీశిశు సంక్షేమశాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా ఛైర్‌పర్సన్ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ బడుల్లో సకల సౌకర్యాలు ఉండాలనే లక్ష్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ వారు మండలంలో 27 పాఠశాలలకు లైబ్రరీ రాక్స్, బుక్స్‌ను అందించేందుకు ముందుకు వచ్చారు. అందులో భాగంగా బుధవారం మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలోని ప్రాథమిక పాఠశాలకు లైబ్రరీ రాక్స్, బుక్స్‌ను ఉపాధ్యాయులు, విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా విశాల మాట్లాడుతూ..విద్యార్థులు దాతల సహకారంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి నిధులు ఇచ్చి విద్యకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మండల విద్యాధికారి మనోహర్, రోటరీ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ అధ్యక్షుడు మధులేటి, కార్యదర్శి ఆదినారాయణ, కోశాధికారి జీఎస్‌రెడ్డి, బండాబాల్‌రెడ్డి, హరికొల్లారెడ్డి, శ్యామ్ రెడ్డి, సతీశ్‌రెడ్డి, మహీధర్‌రెడ్డి, రమణ, ప్రధానోపాధ్యాయులు మఠం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వ్యర్థాల తొలగింపుతోనే పర్యావరణ పరిరక్షణ

కేఎల్‌డీమ్డ్ టూబీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పార్థసారధివర్మ



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ పార్థసారధివర్మ

మొయినాబాద్‌రూరల్: పర్యావరణ అనుకూల ఇంధన పరిష్కారం కోసం బయోడిగ్రేడబుల్ వ్యర్థాల అన్వేష పరిశోధనలో అధ్యాపకులు ఎంతో పరిశోధన చేయాలని కేఎల్‌డీమ్డ్ టూబీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పార్థసారధివర్మ అన్నారు. బుధవారం మండలంలోని అజీజ్‌నగర్ సమీపంలో గల కేఎల్ డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో బయోడిగ్రేడబుల్ వ్యర్థాలపై పరిశోధన అవగాహన సదస్సును ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో డాక్టర్ పి.ఎస్.శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారధివర్మ మాట్లాడుతూ..వ్యర్థాలను పర్యావరణ పరిష్కారాలలో ఉపయోగించుకునేందుకు వివిధ పరిశోధనలను స్థిరంగా నిర్వహించాలన్నారు. ఒక పరిశోధన బృందంతో కలిసి ఇటీవల సాధించిన విజయం ప్రతిష్టాత్మకంగా ఏసీఎస్ అప్లెయిడ్ మెటీరియల్స్, ఇంటర్‌పేస్ జనరల్‌లో ప్రచురితమైందని తెలిపారు. వేస్ట్ చికెన్, క్యాట్ ఆయిల్‌ను ఉపయోగించి కార్బన్ నానో ఆనియన్ ప్రత్యేకంగా కార్బన్ పదార్థాన్ని రూపొందించడంపై పరిశోధన దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ బాగయ్య



రిటైర్డ్ ప్రొఫెసర్ భాగయ్య, అనురాధను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని బాకారం సమీపంలోని డ్రీమ్ వ్యాలీ రిసార్ట్‌లో బుధవారం అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988–89 సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. 35 సంవత్సరాల సుదీర్ఘ విరామం తరువాత కలుసుకొని పాత జ్ఞాపకాలతో నెమరవేస్తున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పూర్వ ఉపాధ్యాయులైన ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్, తెలంగాణ రాష్ట్ర 15 తెలుగు యూనివర్సిటీ కమిటీ మెంబర్ భాగయ్యతో పాటు అప్పటి ఇంగ్లీష్ టీచర్ అనురాధ పాల్గొని విద్యార్థులతో రోజంతా గడిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అధ్యాపకులను సన్మానించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ భాగయ్య మాట్లాడుతూ.. ప్రపంచంలో 84 లక్షల జీవరాసుల్లో ముఖ్యమైనది విద్య అని అన్నారు. అది మానవుడికి విజ్ఞానాన్ని, విలువలను కాపాడే విధంగా ఉంటుందని సూచించారు. 35 సంవత్సరాల తరువాత ఒక్క చోట కలుసుకొని స్నేహితులుగా నెమరువేసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సుధాకర్‌యాదవ్, తూర్పు చెన్నారెడ్డి, రాజిరెడ్డి, వెంకటేష్, వెంకట్‌రెడ్డి, షాబాద్‌యాదయ్య, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు సన్మానం

అప్పటి విద్యార్థి అయిన బాకారం మాజీ సర్పంచ్ బద్దుల సుధాకర్‌యాదవ్ అక్షరాభ్యాసంలో 2016లో జాతీయ అవార్డును రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ చేతుల మీదుగా అందుకున్నారు. అలాగే, అజీజ్‌నగర్ గ్రామానికి చెందిన తూర్పు శారద రాంనగర్‌లో అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తూ జాతీయ స్థాయి బెస్ట్ అంగన్‌వాడీ అవార్డును 2018లో అప్పటి శిశుసంక్షమ శాఖ అధ్యక్షురాలు మేనకగాంధీతో ఢిల్లీలో అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్‌యాదవ్, శారదలను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

వసతి గృహాల సమస్యలు పరిష్కరించండి

ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల డిమాండ్



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న నాయకులు

చేవెళ్ల: విద్యార్థులు ఉండే వసతి గృహాల్లో సమస్యలు తాండవిస్తున్నా పట్టించుకునే వారు లేరని ఎస్‌ఎఫ్‌ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని బుధవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వసతిగృహ భవనం శిథిలమైందని పైన పెచ్చులు ఊడి పోయి కింద పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందే వసతిగృహాలను బాగుచేయించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో పాతభవనాల్లోనే విద్యార్థులు ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఎప్పుడు పైకప్పు పెచ్చులు ఊడి పైన పడుతాయోనని విద్యార్థులు భయపడుతున్నారని అన్నారు. విద్యార్థులకు నీటి వసతి కోసం ఏర్పాటు చేసిన బోరు కూడా పనిచేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు హాస్టల్ భవనాన్ని పరిశీలించి నూతన భవనం మంజూరు చేయాలని కోరారు. లేని పక్షంలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

దైవ చింతన అలవర్చుకోవాలి

మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ నారాయణ రెడ్డి



సభ్యులకు విరాళం అందజేస్తున్న నారాయణరెడ్డి

నందిగామ: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ వంకాయల నారాయణరెడ్డి అన్నారు. నందిగామ శివారులోని పారిశ్రామికవాడ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయ నిర్మాణానికి రూ.1 లక్ష నగదును బుధవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డి మాట్లాడుతూ.. పురాతన చరిత్ర కలిగిన అయప్ప ఆలయాన్ని పునః నిర్మాణ పనులు చేస్తున్నందున తన వంతు విరాళం అందించినట్లు చెప్పారు. గతంలో విరాళాలు రాసిన వారు వీలైనంత త్వరగా అలయ కమిటీని సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో గురుస్వామి గిరిషన్ నాయర్, ఆలయ కమిటీ ఛైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాంరెడ్డి, శ్రీకాంత్ గౌడ్, సుదర్శన్‌గౌడ్, నర్సింహాయాదవ్, నర్సింహా పాల్గొన్నారు.

విద్యాశాఖకు మంత్రిని నియమించాలి

బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి మహేందర్



షాబాద్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించాలని బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా సంస్థలు పునః ప్రారంభమైనప్పటికీ విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం సీఎం రేవంత్‌రెడ్డి చేతగాని పాలనకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖకు మంత్రిని నియమించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యార్థులకు దిశానిర్దేశం చేయాల్సిన శాఖ మంత్రి లేకపోవడంతో సమయానుకూలంగా నిర్ణయాలు తీసుకోలేపోతున్నారని అన్నారు. తక్షణమే విద్యాశాఖకు మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



బడిబాట ముగింపు ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

నందిగామ: ప్రైవేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల్లోనే నిపుణులైన ఉపాధ్యాయులు ఉంటారని, వారి బోధనలు సత్ఫలితాలు ఇస్తాయని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ అన్నారు. నందిగామలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల విద్యార్థులు బడి బాట ముగింపు కార్యక్రమం సందర్భంగా బుధవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా చదువుకోవాలని, విద్యతోనే ఏదైన సాధించవచ్చని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలు ఉచితంగా అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రత్నయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి రాహుల్‌గాంధీ



కేక్ కట్‌చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేవెళ్ల: దేశంలోని పేదలకు మేలు చేయాలనే ఆలోచన కలిగిన వ్యక్తి రాహుల్‌గాంధీ అని కాంగ్రెస్ పార్టీ డీసీసీ మాజీ అధ్యక్షుడు పి. వెంకటస్వామి, టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఎస్. వసంతం, పీఏసీఎస్ చైర్మన్ డి. వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద బుధవారం ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్‌కట్ చేసి పంచారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దేశంలోని అసమానతలకు వ్యతిరేకంగా అందరిని ఏకం చేసేందుకు దేశం మొత్తం భారత్‌జోడో యాత్రను చేసిన వ్యక్తి రాహుల్ అన్నారు. ఆయన నాయకత్వంలో కాంగ్రెస్‌పార్టీ ఎంతో బలోపేతం అయిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఆగిరెడ్డి, మధుసూదన్‌గుప్తా, పెంటయ్యగౌడ్, ఎంపీటీసీ రాములు, నాయకులు జనార్దన్, బాలయ్య, మానిక్యం, తదితరులు ఉన్నారు.

అతిథిగృహం నిర్మాణానికి నిధులు మంజూరు



మంత్రి కోమటిరెడ్డిని కలిసిన ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహం శిథిలావస్థకు చేరుకుంది. ఏళ్లనాటి కట్టడం కూలడానికి సిద్ధంగా ఉంది. గత ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో అతిథి గృహం శిథిలావస్థకు చేరింది. బుధవారం ఎమ్మెల్యే శంకర్ రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ అతిథిగృహం పరిస్థితిని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రభుత్వ అతిథిగృహం ఆవశ్యకతను వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రభుత్వ అతిథిగృహం నిర్మాణానికి రూ 4కోట్ల40లక్షలు, ఆర్‌అండ్‌బి కార్యాలయం నిర్మాణానికి రూ 80లక్షలను మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. నిధులు మంజూరు చేసిన మంత్రికి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆరోగ్య 'సిరి'ధాన్యాలు



చిరు ధాన్యాలు చిన్నగా ఉన్నాయని చిన్నచూపు చూడవద్దు. రాగులు, సజ్జలు, కొర్రల లాంటి గింజలు గొప్పగా కనిపించకపోవచ్చు. కానీ ఆరోగ్యానికి అవి చేసే మేలు అనంతం. ఆరోగ్యంగా ఉంటే.. అంతులేని సిరి మనచెంతే..

దుద్యాల్: రెడీమెడ్ ఫుడ్‌కు అలవాటు పడిన జీవితాలు.. పోషక విలువలు ఉన్న ఆహారం కోసం ఎదురు చూస్తున్నాయి. సగటు మనిషి పౌష్టికాహార ఆహార పదార్థాల కోసం అన్వేషిస్తున్నారు. అందులో భాగంగా చిరుధాన్యాలతో కూడిన వంటకాలను ఆరగించేందుకు మక్కువ చూపుతున్నారు. ఆరోగ్యానికి మేలు చేస్తాయని వైద్యులు సూచిస్తుండగా.. వినియోగం మేరకు గింజల పంటలను పెంచేందుకు వ్యవసాయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నారు.

ప్రయోజనాలు

చిరుధాన్యాల్లో జొన్నలు, సజ్జలు, రాగులు ప్రధానమైనవి. అరికెలు, సామలు, అండ్రు కొర్రలు, ఊదలు లాంటి వాటిని సూక్ష్మ ధాన్యాలుగా పిలుస్తారు. వరి, గోధుమలకన్నా ఇవన్నీ అధిక పోషకాలను కలిగి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. వీటి వలన ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలుంటాయని, శరీరంలో కొలస్ట్రాల్‌ను తగ్గించడం, రక్తపోటు, బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధులను అదుపులో ఉంచుతాయని, రోగ నిరోధక శక్తిని పెంచుతాయని స్పష్టం చేస్తున్నారు.

పెరిగిన వినియోగం

పాతకాలపు ఆహారపు అలవాట్లు క్రమంగా ముందుకు వస్తున్నాయి. కొన్ని దశాబ్దాల క్రితం వరకు ఎక్కువగా చిరుధాన్యాలనే ఆహారంగా తీసుకునే వారు. రాగులు, జొన్నలు, సజ్జలు వంటి వాటితో రొట్టెలు చేసుకొని తినివారు. కొర్రలు, సామలు, అండ్రు కొర్రలు వంటి వాటితో అన్నం వండుకొని భుజించేవారు. కానీ చాలా కాలంగా పట్టణంతో పాటు పల్లె ప్రాంత ప్రజల జీవన శైలీలో చిరుధాన్యాల వినియోగం తగ్గింది. వరి అన్నం, ఫాస్ట్ ఫుడ్‌ను అధికంగా తింటున్నారు. ఫలితంగా చిరుదాన్యాల సాగు విస్తీర్ణత, పండించే రైతులు తగ్గుతూ వస్తున్నారు. ఉరుకులు పరుగుల జీవితంలో ఫాస్ట్ ఫుడ్‌కు అలవాటు పడి కొని తెచ్చుకుంటున్న అనారోగ్య సమస్యలు, కోవిడ్ తర్వాత ప్రజల ఆహారపు అలవాట్లలో అనేక మార్పులు వచ్చాయి. చిరుధాన్యాల ప్రయోజనాలు, కలిగే లాభాలు తెలిసి వచ్చాయి.

పెరిగిన చిన్నగింజల వినియోగం

- వ్యాధి గ్రస్తులకు ఎంతో మేలు
- మిల్లెట్స్‌తో పెరిగిన ఆహార పదార్థాల తయారీ
- ఆరగించేందుకు ఆసక్తి చూపుతున్న ప్రజలు
- సాగు చేసేందుకు ముందుకు వస్తున్న రైతులు

వారంలో మూడు రోజులు



అధిక పోషకాలు ఉన్న ఆహారం తినాలనే ఉద్దేశంతో చిరుధాన్యాలతో వంటకాలు చేస్తున్నాం. వారంలో మూడు రోజులు కొర్రలతో అన్నం, దోసెలు, రాగులతో లడ్డూలు, ఇడ్లీలు తయారు చేసుకుంటున్నాం. మా ఇంట్లో నిత్యం పచ్చజొన్న రొట్టెలు, బ్రౌన్ రైస్ భోజనం ఆరగిస్తాం . ధరలు అధికమైనా సరే.. కావాలసిన గింజలను కొంటాం. వీటి భోజనం చాలా రుచిగా ఉంటుంది. అలవాటు పడితే వీడటం కష్టం. నాలుగేళ్లుగా తింటున్నాం.

– మానస, గృహిణి, హస్నాబాద్.

రైతులను ప్రోత్సహిస్తున్నాం



ప్రజల అవసరాల మేరకు చిరుధాన్యాలను పండించాలని రైతులను ప్రోత్సహిస్తున్నాం. మార్కెట్లో వాటికి మంచి ధర పలుకుతోంది. సాగు గురించి రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు గ్రామాల్లో మా ఏఈఓలు అందుబాటులో ఉన్నారు. వారిని సంప్రదించి, అవసరమైన సలహాలతో గింజలను సాగు చేయండి. మంచి దిగుబడితో పాటు.. లాభాలు పొందండి. ప్రజలకు ఆరోగ్యాన్ని ప్రసాదించండి.

– గోపాల్, జిల్లా వ్యవసాయ అధికారి, వికారాబాద్